# గొంతు దిగని అభ్యుదయం

కోరుకొండ సత్యానంద్




ఛీ! తనెంత నీచుడు...? తన మన సెంతగా దిగజారిపోయింది...? పద్మను ఎలా వూహించాడు? పద్మ! నిజంగా మనసున్న మనిషి. ఆ మనసులో ఎన్ని అందమైన ఆలోచనలు...? ఎన్ని ఉదాత్తభావాలు...?

ఇన్నాళ్ళూ తానే ఏదో గొప్పవాడి ననుకున్నాడు. తనకే అన్ని విషయాలూ తెలుసననుకున్నాడు. ఈ రోజే తెలిసింది.... తనకు తెలియకుండా తనెంత నికృష్టంగా మారిపోయాడో! తాను నిజంగా మనిషి కాదు. తనకు నివృత్తి లేదు.... శేఖర్ తల పీక్కున్నాడు,...

పద్మ ఎంత అర్థవంతంగా మాట్లాడింది? ఆమెలో ఆ భావాల్ని త నెప్పుడూ చూడలేదు. తాను తెలుసుకోవలసింది, నేర్చుకోవలసింది, తనలో లేనిది పద్మదగ్గరే ఉంది...

అతని కళ్ళు ఏకధారగా వర్షిస్తున్నాయి.. కళ్ళు ఎర్రగా మారాయి...

మనసులో ఏదో సిగ్గు... తన మీద తనకే అసహ్యం!

ఎదురుగా అద్దం... ఆ అద్దంలో అతని రూపం...నిండైన రూపం... అందమైన విగ్రహం.. పుష్టిగా ఉన్న శరీరం..

ఛీ! ప్రజల్ని త నెంతగా మోసగించాడు?

శేఖర్ అభ్యుదయవాది... ఎన్నో సుగుణా లున్న మహామనిషి... అనుకొని మోసపోయారు.

కాదు.. మోసగించాడు. పేరు తెర అడ్డం పెట్టుకుని, రచనల దుప్పటి కప్పుకొని... ఈ ప్రజల్ని నేర్పుగా మోసగించాడు.

బజ్జర్ శబ్దం చేసింది. ముఖం తుడుచుకుని

నెమ్మదిగా తలుపు తీశాడు...

"నమస్కారం, సార్... నమస్కారం, సార్... గుడ్ ఈవెనింగ్, సార్!"

"రండి . . ."

అందరూ లోపలకు వచ్చి కూర్చున్నారు...

వాళ్ళేదో అడిగారు... అర్థించారు... ఎంతైనా ఇచ్చుకుంటాం అన్నారు. మీ సహకారం లేకపోతే ఏమైపోవాలి? అన్నారు. ఎలాగైనా సరే సహాయం చెయ్యండి అన్నారు. మీరు లేకపోతే మేం మునిగి పోతాం... అన్నారు.. ఆఖర్న మీరు తండ్రే మేంలేమే అన్నారు.

ఆ మాటలు శేఖర్ హృదయానికి శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. తనలో ఉన్న బలహీనతను వేలెత్తి చూపుతున్నట్లున్నాయి. ఆ మాటలు వింటుంటే శేఖర్ శరీరం సిగ్గుతో చచ్చి పోతుంది.

"నో! మీ రందరూ వెళ్ళండి.... ప్లీజ్... నన్నొంటరిగా,,, ఉండనీయండి... ఏది ఏమైనా, మీరేమైపోయినా ఒక్క అక్షరం ముక్క వ్రాయను, గెటవుట్!"

శేఖర్ సౌమ్యమైన చిరునవ్వునే చూసిన వాళ్ళు... ఒక్కసారిగా హడలిపోయారు... వాళ్ళకేమీ అర్థం కాలేదు... వెళ్ళిపోయారు...

వాళ్ళను చూసి పిచ్చిగా నవ్వుకున్నాడు శేఖర్. పిచ్చివాళ్ళు... తనతో వాళ్ళకు పనిలేదు.. తను నలుపు చేసిన కాగితాలే వాళ్ళకు కావాలి...

తనేదో గొప్పవాడినని అనుకుంటున్నారు...కానని తెలిసినా, వాళ్ళు రావడం మానార్తా? ప్రజలకు, తనకు మధ్య వారధుల్లాంటి వాళ్ళు వీళ్ళు!

తన పేరుతో వీళ్ళ డబ్బు గడిస్తారు... తనకూ కాస్త పడేస్తారు!

ఎటొచ్చీ మోసపోయేది ప్రజలే! గుడ్డిగా తన లాంటి వారిని ఆదరించి ఆరాధించే ప్రజలే!

చీకటి పడిపోయింది... కాని, ఆ గదిలో లైటు వెలగలేదు...

చీకటే.. హు... నల్లని హృదయానికి తెల్లని వెలుగెందుకు?

అలాంటి వెలుగులో ఉండాల్సింది... పద్మలాంటి వాళ్ళు! తన పద్మలాంటి వాళ్ళు!

ఆమెలో ఎంత అవగాహన...?

తను వూహించిన పాత్రల్నే పాఠకుల చేత చదివించగలడు... కాని...పద్మ? మంచి ముసుగులో ఉన్న తనలోని చీకటిని, కుళ్ళును చదవ గలిగింది..

ఒరే శేఖర్! రచయితా! ది గ్రేట్ రైటర్! ఆంధ్రుల అభిమాన అభ్యుదయ రచయితా! నువ్వింతే! నువ్వు చీకటిలోనే ఉండాలి... నువ్వే కాదు... తెల్లని కీర్తి విభూదిని ఒంటికి పూసుకొన్న ప్రతి మనసు లేని రచయితా చీకటిలోనే ఉండాలి... మనసు ఘోష!

పిచ్చిగా నవ్వుకున్నాడు శేఖర్!

ఆ చీకటిలో పాలమీగడ లాంటి పద్మ. . తన కంటే ఎంతగానో ఎదిగిపోయిన పద్మ! తనవైపు చూసి నవ్వుతుంది... అందంగా, ఆరాధనగా, అపహ్యంగా, వెటకారంగా...

• • • •

కిటికీలోంచి లోపలకు వస్తున్న భానుని లేలేత కిరణాల తాకిడికి తెలివి వచ్చింది శేఖర్‌కి.

మత్తుగా కళ్ళు మూసుకున్నాడు...

యవ్వనానికి కొత్త రుచి చూపించిన రాత్రి గడిచిపోయింది..

తొలిరేయి అనుభవాల్ని తనెన్నో రాసి రక్తి కట్టించాడు. కాని... నచ్చిన యువతిని పెళ్ళి చేసుకొని ఆ అనుభవాన్ని ఎంతో అందంగా, ఆనందంగా అనుభవించింది నిన్నటి రాత్రే!

రాత్రంతా ఆ అనుభవంలో మెత్తగా కరిగి పోయింది.

ఆ అనుభవాల్తో ఒక మంచి కథ వ్రాయాలి. తన నిజమైన అనుభవాల్ని ఆ కథలో అతి నేర్పుగా చొప్పించాలి... వాస్తవాన్ని సృష్టించాలి... కుర్రకారు లేత హృదయాల్ని ఆకాశంలోని మబ్బుల్లా తేలించాలి... అనుకున్నాడు.

అంతలో ఎవరో వచ్చినట్లై అటు చూశాడు.

పద్మ! తలార స్నానం చేసింది. తల విరబూసుకుంది. అందంగా గులాబిరంగు చీర... తెల్లని మేనిచ్ఛాయ... మధురమైన అధరాలు...కెంపులు పొదిగిన చెంపలు... బెదురు చూపుల నేత్రాలు... ముఖంలో, మాటలలో చెప్పలేని భావాలు...

రాత్రి గుర్తుకొచ్చింది శేఖర్‌కి.

"కాఫీ . . ." పద్మ కంఠం...

మెత్తని స్వరం ఎంత మధురంగా ఉంది!

దగ్గరగా వెళ్ళాడు. కాఫీ అందుకుంటూ చేయి పట్టుకున్నాడు. యవ్వనపు తరంగాల ప్రసరణ...

తలవాల్చుకుంది పద్మ.

నెమ్మదిగా చెవిలో "సిగ్గా?" అని అడిగాడు.

తల అడ్డంగా వూపింది పద్మ.

"మరి.. భయమా?"

"ఉహూం...

"మరి....?"

"గర్వం...!"

"ఆం... గర్వమా!... ఎందుకు?"

"ఓహో రచయిత భార్యనని..."

చేయి సుతారంగా విడిపించుకొని వెళ్ళి పోయింది.

ఎంత మాటకారి? మాటలు రాని ముగ్ధ అనుకున్నాడే తను.

• • • •

"మీ రచనలంటే నాకు చాలా ఇష్టం! పెళ్ళికి ముందు కూడా మీ రచనలు చదివేదాన్ని. మీ రచనలంటే చెవి కోసుకునే దాన్ని."

"అయితే, దేవిగారికి చాలా చెవులుండేవన్న మాట..."

"ఛీ! పొండి.."

"నా రచనలు ఎలా ఉండేవి?"

"సంఘానికి దర్పణాల్లా ఉండేవి, పెత్తందారీ వ్యవస్థ ఇరుకుల్లో ఉండి కనిపించని నిజాల్ని వెలికి తీసుకొచ్చేవిగా ఉండేవి. ప్రేమకు ప్రతిరూపాల్లా ఉండేవి. అభ్యుదయానికి మారుపేరులా ఉండేవి... నా ఫ్రెండ్సందరికీ కూడా మీ రచనలంటే ఇష్టం!"

"అహాం... అలాగా? నాకు మాత్రం నీ ఫ్రెండ్సంటే ఇష్టం లేదని చెప్పు... నువ్వు మాత్రం..." అని దగ్గరగా తీసుకున్నాడు.

"ఛీ. పొండి."


నవ్వులు . . .

• • • •

"అబ్బా... పద్మా! నువ్వు నన్ను చంపేస్తున్నావు!"

"నేనేం చేశానండీ! బీచికి తీసుకు రమ్మన్నాననా— ఎప్పుడూ ఆ గదిలో కూర్చొని రాసుకోవడమేనా? పెళ్ళి చేసుకున్నాక కూడా కాస్త రిలీఫ్ ఇవ్వకపోతే ఎలా ఆ ప్రాణానికి...

"అది కాదు, పద్మా! నువ్వింత అందంగా ఉండి నన్ను చంపుతున్నావ్ అనుకో! ఓ దైవమా! నీకు నేను చాలా ఋణపడి ఉన్నానయ్యా! ఈ అందాల రాశిని, దేవతా స్వరూపిణిని, లేడి చూపుల లేత సోయగాన్ని, చిలిపి నవ్వుల



చిన్నారివి, నా హృదయరాణివి, నా జీవిత భాగ స్వామురాల్ని, అపురూప సౌందర్యమకరందారమకరందపు జల్లువి, హరివిల్లువి...''

''అబ్బా! ఎక్కడకొచ్చినా ఇదే జబ్బా? దేవుడా! నా కిలాంటి భర్తను ప్రసాదించావేమయ్యా?''

• • •

అలా పేరున్న రచయిత సరసన పద్మ ఎంతో ఆనందంగా కాలాన్ని గడుపుతుంది...


సంఘంలో ఎంతో గౌరవం సంపాదించుకున్న భర్త, అంతకంటే తనవెంతో మురిపెంగా చూసు కునే భర్త దొరకడం ఏ స్త్రీకి ఆనందం, సంతృప్తి కాదు?

• • • •

''ఏమండీ! నా దో చిన్న కోరిక...

''అడుగు, దేవీ! బంగారం చాలా ఖరీదులో ఉంది, బంగారు లేడినితప్ప ఇంకేదైనమా కోరుకొనుము...''

''మీ కెప్పుడూ హాస్యమేనా?''




''అపహాస్యము చేయకు, దేవీ! నాకు ఆగ్రహా వేశాలు వచ్చుచున్నవి... వేగముగా అడుగుము.''

''ఏమండీ! మీరు వ్రాసిన నవల సినిమా తీశారు కదా! అది రిలీజయ్యిందికదండీ! ఆ సినిమాకు నన్ను తీసుకెళ్ళరూ?''

''అంతేనా, దేవీ! ఈ మాత్రానికే మూడు ముళ్ళూ వేసిన మగనికడ కదు సిగ్గు? అవునులే! ఆడపిల్లకు సిగ్గు, లేడి పిల్లకు పరుగు మరి అందం కాదా!... అది ఏనాడో నా చిన్నవాడు వ్రాసిన నవ లవు తునక... నాకే గుర్తులేదు... నీ సరసన చూసి గుర్తు తెచ్చుకొనెద గాక!... సాయం సమయానికి తయ్యారు కమ్ము!''

• • • •

సినిమా మొదలయ్యింది.

ఒక అందమైన చిలిపి వయసు కాలేజీ కుర్రాడు— అతని చూపు సోకితే వళ్ళో వాలిపోయే అందమైన అమ్మాయిలు. డబ్బుందన్న అహంకారం... అంద ముందన్న గర్వం... ఆడదంటే చులకన...ఫలితం... ఎందరో అమ్మాయిల్ని తన బిగి కౌగిలిలో బిగించి, ఎవరికి నచ్చే మాటలు వాళ్ళకు చెప్పి, ఏదో ఆశ చూపించి, మభ్యపెట్టి ఆనందంగా అనుభవించే వాడు.

అందరిలా అతనికీ పెద్ద ఎత్తున కట్నంతో పెళ్ళి జరిగింది. కాలం హాయిగా జరుగుతున్న సమ యంలో ఒక సన్నివేశంలో మరో పాత్రద్వారా తన భార్య ఎందరి చేతుల్లోనో నలిగిన పువ్వు అని తెలిసింది.. అంతే! భార్యను వెళ్ళి అడుగుతాడు. అవును... అని ధైర్యంగా ఒప్పుకుంటుంది. ఆమె ధైర్యానికి ఆశ్చర్యపోతాడు. తిరిగి అతనినే ఎన్నో విషయాలు అడుగుతుంది. అవాక్కయిపోతాడు. ఆఖర్న అందమైన ముగింపు...

సినిమా పూర్తయిపోయింది.

ఆ సినిమా కథ రచయితగా తెలిసిన ఎందరో ప్రేక్షకులు శేఖర్ చుట్టూ మూగి ఏవేవో మాట్లా డారు. ఆటోగ్రాఫులు తీసుకున్నారు.

''సినిమా ఎలా ఉంది, పద్మా?''

''చాలా బాగుందండి? చక్కని ఇతివృత్తం. కుర్రాళ్ళ ప్రవర్తనను అద్దంలో పట్టి చూపించింది.''

''ఆ సినిమాలో హీరోని నేనే అయితే ఏం చేస్తావ్?''

''ముక్కుపిండి మూల కూర్చో పెడతాను.''

• • • •

రాత్రి పన్నెండు గంటలయ్యింది. ఏదో పత్రి కకి కథ ఒకటి పూర్తి చేసి అలసటగా మంచం మీదకు చేరాడు శేఖర్. పద్మ మత్తుగా నిద్ర పోతోంది.

శేఖర్ ఆలోచనలో పడ్డాడు..

ఆ ఆలోచనల్లో ఈరోజు చూసిన సినిమా... తను కాలేజీలో చదివేటప్పుడు రాసిన నవల అది.

అది రాయడానికి కారణం తనే! ఆ పిక్చర్లో హీరో పాత్ర తనే! తను కాలేజీలో చదువుతున్న ప్పుడు ఎంత మంది అమ్మాయిలు?

తను రచయితనని తెలిసి నాకూ కథలు వ్రాయ డం నేర్పమని వచ్చిన సరోజ... తన వళ్ళో పడి పోయింది. పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చాడు. ఆమాటతో తన సర్వస్వాన్నీ అర్పించుకొంది. చివ రకు ఏమయ్యింది? వాళ్ళ నాన్నగారికి బెంగుళూరు ట్రాన్స్‌ఫరైతే వెళ్ళిపోయింది. వెళ్ళేముందు తన రూముకు వచ్చింది. కానీ, ముందే తెలిసిన తను ఆమె కోసం కాచుకొని ఉంటాడా? పాపం, నవలంత ఉత్తరం వ్రాసి, నవలల్లో డైలాగులు కాపీకొట్టి రూములో పెట్టి వెళ్ళిపోయింది. పాపం ఆమె శీలం లాగే ఆమె ఉత్తరం చిరిగిపోయింది.

ఫైనలియర్‌లో రాధ! ఆమె కోసం నా పేరు కూడా మార్చేసింది. కృష్ణా అని తియ్యగా పిలిచేది. పాపం పదివేల మంది గోపికల్లో తనూ ఒకతై పోయింది.

ఇక ఎమ్మేలో సునీత! లేటెస్ట్ గర్ల్. అయినా ఆడదాని మనసు ఎక్కడికి పోతుంది. పెళ్ళి అంది. నేనూ నాలుగు లేటెస్ట్ మాటలు చెప్పాను. పెళ్ళి అన్నది ఒట్టి భ్రమ... లవ్...లవ్ ఒక్కటే మిగి లేది... జీవితం అనే పుస్తకంలో ప్రతి పేజీ ఒక్కో రసంతో ఉండాలి. లైఫ్ మీన్స్ ఎ మిక్చర్ ఆఫ్ వెరైటీస్ ఆఫ్ లవ్స్! అన్నాను. పిచ్చిది నమ్మేసింది. సునీత ఆలోచనలు మనసంస్కృతి కంటె ముందంజ వేశాయి. ఆ కేసూ అంతే!

ఇవే చాలాకాలం లీడ్ చేసినవి... ఆడపా దడపా వారానికో ఆదివారం అన్నట్టుగా చాలా కేసులు ఉండేవి.

తన అనుభవాలే ఆ నవల... సంఘానికో నీతి చెప్పాలి కనుక చివర ఒక చక్కని మలుపు... నీతి... అలాంటి నీచులికి చివరి కలాగే శాస్తి జరుగు తుంది. అని గొప్ప చెప్పాను.

శేఖర్ నవ్వుకున్నాడు... ఎందుకో మరుక్షణంలో ఆ నవ్వు ఒక్కసారిగా ఆగిపోయింది.

ఆలోచనల్లో వెనక్కి వెళ్ళాడు.

అయితే, తాను అలాగే చేశాడు.. అయితే, తనకు అలాంటి భార్య వచ్చిందా? పద్మ కూడా అలాంటిదేనా?

ఎంత ఆలోచించకుండా ఉందామన్నా ఉండలేక పోతున్నాడు...

ఛ! పద్మ అలాంటిది కాదు. ఒక్కసారి పద్మ వైపు చూశాడు. అమాయకంగా పడుకొంది. ముఖంలో ఎటువంటి భావాలు లేవు—సంతృప్తి తప్ప!

ఈరోజు ఇలా ఆలోచించానేమిటి? పద్మను అలా వూహించానేమిటి? పద్మ అమాయకురాలు. అయితే ఆ పిక్చర్ తను వ్రాసిన నవల, వూహించిన పాత్రలు జీవితంలో తారసపడతాయా? అంతా భ్రమ.

మరు నిమిషంలో పద్మ అమాయకురాలు.

**ఆ సినిమాలో హీరోయిన్ కూడా అమాయకురాలే!** పద్మకంటే అమాయకురాలు. అందులో హీరో కూడా తనలాగే భార్యను అమాయకురాలు అనుకుంటాడు. కానీ, చివరకు ఏమయింది?

ఆ క్షణంలోనే పద్మకి నిజంగా ఏమీ తెలీదు. సినిమా అయిపోయాక తనే మన్నాడు? ఆ సినిమాలో హీరోని నేనే అయితే ఏంచేస్తావ్? అన్నాడు. అదే చెడుభావాలు కలది అయితే ఆ హీరోయిన్‌లా ప్రవర్తిస్తాను అనేది కానీ, పద్మ అలా అనలేదే?

అహ...ఆడవాళ్ళు గొప్ప గడుసువాళ్ళు. ప్రతి పలుకులో అతి జాగ్రత్తగా ఉంటారు. పద్మ అలా అనగూడదనే అని ఉండకపోవచ్చు.

పద్మ బియస్సీ వరకూ చదువుకుంది. రోజూ బస్సుమీద వెళ్ళి చదివింది. ఆ బస్టాండు దగ్గర ఎవరైనా పరిచయం కావచ్చు. సైన్సు గ్రాడ్యుయేట్స్. ఇద్దరు ముగ్గురు కలసి ఒక్కో ప్రాక్టికల్ చేయాల్సి ఉంటుంది. డిసెక్షన్లు ఉంటాయి. బాచీలుగా విడగొడ్తారు. నంబరు వారీ కూర్చో బెడితే ప్రక్కనో, వెనుకో, ముందో ఏదో మగ పురుగు పడకపోదు. ప్రతివారం అలాగే కూర్చోవాలి. అలా ఎవరైనా పరిచయ మవ్వచ్చు. అందులో ఎడ్యుకేషనల్ టూర్స్ ఉంటాయి. పదిరోజులు పైగా గడుపుతారు. పది పగళ్ళు, పది రాత్రులు... ఎప్పుడైనా అవకాశం ఉండొచ్చు.

శేఖర్ ఆ విషయాన్ని శతవిధాలా ఆలోచిస్తున్నాడు.

తన భార్య పెళ్ళిగాకముందు తనలా ఏమైనా వ్యవహారాలు నడిపిందా? లేదా?

ఆ ఆలోచన వచ్చిం దగ్గర్నుండీ ప్రతి సంఘటననూ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

• • • •

పోస్ట్!

శేఖర్ ఉత్తరం అందుకున్నాడు. అది పద్మ నాన్నగారు వ్రాసింది.

ఇద్దరికీ అడ్రస్ చేస్తూ వ్రాశాడు. ఉత్తరం పూర్తిగా చదివాడు.

ఆఖరు లైన్లు శేఖర్ని ఆకర్షించాయి.

మధు విశాఖపట్నంనుండి వచ్చాడు. రీసెర్చి పూర్తి అయిందట. ఇక్కడే జాబ్‌కోసం ట్రై చేస్తున్నాడు. నిన్ను చూడాలని ఉందట. నిన్ను మరీ మరీ అడిగినట్లు వ్రాయమన్నాడు. వీలైతే నిన్నో ఉత్తరం వ్రాయమన్నాడు.

శేఖర్ వూపిరి బిగబట్టి మళ్ళీ చదివాడు.

"ఏదో ఉత్తరం వచ్చినట్టుంది. మాకా?" చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ వచ్చి అడిగింది పద్మ.

"కాదు...నీకే!"

పద్మ అందుకొని చదవడం పూర్తి చేసింది.

"మధు ఎవరు, పద్మా?" అనుమానం రానంత తాపీగా అడిగాడు.

"మధు మా ఇంటి ప్రక్క అబ్బాయండీ. వాళ్ళు, మేము చాలా క్లోజుగా ఉండేవాళ్ళం! మధు నాకు సీనియర్. నాకు నోట్సులు కూడా ఇచ్చేవాడు. మధు కోచింగ్ లేకపోతే నాకు క్లాసొచ్చేది కాదు. యమ్మెస్సీ పూర్తిచేసి రీసెర్చి కూడా పూర్తి చేశాడు. మగాడే అదృష్టవంతుడు. ఆడపిల్ల వయసొస్తే పెళ్ళి తొందర ఇంట్లో వాళ్ళకు. చిన్నప్పటినుండి కలసి మెలసి పెరగడంతో మా మధ్య అదోరకం అనుబంధం ఏర్పడిపోయింది. నేనంటే చాలా ఇష్టం మధుకి."

ఇంకా ఏదో చెపుతోంది.

శేఖర్ అక్కడినుండి వెళ్ళిపోయాడు.

"ఏమండీ! సినిమాకు వెళ్దాం అన్నారు?"

"ఒక ఎడిటర్ దగ్గరి కెళ్ళాలి. తర్వాత వెళ్దాంలే!"

* * * *

మధు పద్మకు నైబర్. పద్మకు సీనియర్. ఒకే సబ్జెక్టు. నోట్సు లిచ్చేవాడు. చిన్నప్పటినుండీ కలిసే పెరిగారు.

చాలా క్లోజుగా ఉండేవాళ్ళం. కలిసే పెరగడంతో ఏదో అదోరకం అనుబంధం ఏర్పడిపోయింది.



మధుకి నేనంటే చాలా ఇష్టం. ఎన్నో రోజులు, ఎన్నో అవకాశాలు.

పబ్లిక్ పార్కులో ఒకమూల...శేఖర్ కూర్చొని ఆలోచిస్తున్నాడు.

చల్లగాలి అతని తల వేడిని తగ్గించలేక పోతుంది.

పద్మను అడిగితే? సూటిగా అలా అడిగేస్తే బాగుంటుందా? ఇంకా కొన్ని రోజులు వెయిట్ చేయాలి. ఈలోగా పద్మ ప్రతి కదలికనీ సునిశితంగా పరిశీలించాలి. సమయం చూసి అడగాలి.

సంక్రాంతి పండగ వచ్చింది.

అల్లుడుగార్ని, కూతురిని దగ్గరుండి తీసుకెళ్ళారు పద్మ తలి దండ్రులు.

వెళ్ళినరోజు సాయంత్రం బయట గార్డెన్‌లో వాలు కుర్చీ వేసుకొని ఏదో వ్రాసుకుంటున్న శేఖర్‌కి—"హల్లో! గుడ్ ఈవెనింగ్. ఎక్స్యూజ్ మీ, మే ఐ నో యువర్ నేమ్!" అన్న మాటలు విన్పించి అటు చూశాడు.

సుమారు ఆరడుగుల పొడవు, తెల్లగా, హుందాగా ఉన్న ఒకతను వచ్చాడు. నీట్‌గా డ్రస్ చేసుకున్నాడు.

"కమాన్! కూర్చోండి. నా పేరు శేఖర్. మీరు?"

"మధు. పి. జి. అయిపోయింది. రీసెర్చి కూడా మొన్ననే పూర్తి చేశాను. అవును, శేఖర్ అంటే కథలు, నవలలు వ్రాస్తారు—ఆ శేఖరేనా మీరు?"

"అవును..."

"వెరీ గ్లాడ్ టు మీట్ యూ!" నవ్వుతూ షేక్ హాండ్ ఇచ్చాడు.

కాసేపు ఏవేవో మాటలు మాట్లాడి—"మీరు వ్రాసుకుంటున్నట్టున్నారు. ఉండండి. లోపలి కెళ్ళొస్తాను" అని వెళ్ళాడు.

సుమారు అరగంట కావస్తున్నా మధు బయటకు రాలేదు. బాగా చీకటి పడిపోయింది.

శేఖర్ లోపలకు వెళ్ళాడు. హాల్లో అత్త, మామలు కూర్చున్నారు కానీ పద్మ, మధు కన్పించలేదు.

మేడ మెట్లెక్కి తను గదిలోకి వెళ్ళబోయాడు.

ఆ గది పద్మ గది. అందులోంచి నవ్వుతూ ఏవో మాటలు విన్పిస్తున్నాయి. అవి మధు, పద్మవి. కర్టెను వేసి ఉంది. నిల్చొని ఆలకి ద్దామంటే ఎదురుగా అత్త మామలు. తన గదిలోకి వెళ్ళిపోయాడు.

* * * *

ఉదయమే లేచి పద్మకోసం చూశాడు శేఖర్. పద్మలేదు.

అత్తగారు, పనిమనిషి వంట గదిలో ఉన్నారు. మామగారు లేరు. బయటికెళ్ళారు.

పెరటిలోకి వెళ్ళాడు ముఖం కడుక్కోడానికి.

పెరటిగోడ దగ్గర పద్మ ఎవరితోనో మాట్లాడుతుంది. ఎవరా అని చూశాడు. ఇంకెవరు... మధుయే. శేఖర్ అక్కడే నిల్చున్నాడు.

వాళ్ళిద్దరి మధ్యా ఒక గోడ మాత్రమే అడ్డు. మనసుల మధ్య నేనే అడ్డు అనుకున్నాడు. వాళ్ళిద్దరి చేతులూ గోడమీద అలా దగ్గరిగా...

తన నెవరూ గమనించలేదు. శేఖర్ ముఖం మాడిపోయింది. బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

• • •

"ప్రక్కింటి అత్తగారు మనిద్దర్నీ రమ్మంటున్నారండీ! ఈ మహా రచయితతో మాట్లాడాలని అందరూ తహతహ లాడుతున్నారు" అంది పద్మ.

వెళ్ళక తప్పలేదు. మధు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు చాలా సరదాగా మాట్లాడారు. మధు కూడా మధ్యలో ఏవో మాట్లాడాడు. మధుని చూస్తుంటే శేఖర్ ఒళ్ళు మండిపోతుంది.

అడిగిన వాటికి క్లుప్తంగా జవాబులు చెప్పాడు.

"నే వెళ్తాను, పద్మా! నువ్వుంటే ఉండు" అని పద్మ సమాధానంకోసం ఎదురు చూడకుండా వచ్చేశాడు.

రచయితకదా—మితభాషి! అని అనుకున్నారు అందరూ.

రాత్రి ఎనిమిదైనా పద్మ రాలేదు.

ఏమీ తోచక మేడపైకి వెళ్ళాడు. అక్కడ

# కొత్త సీరియల్

మంత్రి అవుతారనుకొన్న అధికార పార్టీ ఎం.ఎల్.ఏ. పతంజలి గారిని నగర శివార్లలోని ఆయన ద్రాక్ష తోటలో ఎవరో దారుణంగా హత్య చేశారు.

ముఖ్యమంత్రి, హోంమంత్రి హత్యాస్థలాన్ని సందర్శించి, సర్వశక్తులూ వినియోగించి హంతకులను పట్టుకోవలసిందిగా పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే ఎంత పరిశోధన జరిపినా హంతకుల ఆచూకీ చిక్కలేదు.

కానీ.... పతంజలి ఒక స్త్రీతో కలసి తోటలోని బంగళాకు వచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అప్పటినుంచి ఆ స్త్రీ కనిపించటం లేదు.

ఒక వంక నేర పరిశోధన సాగిస్తూనే, ఇన్‌స్పెక్టర్ విష్ణుకాంతరావు పోలీసు డిప్యూటీ కమిషనర్ కుమార్తె అహల్య ప్రేమలో పడ్డాడు. వారి ప్రేమ ఫలించే స్థితిలో అహల్య అమెరికాకు పారిపోతుంది.

హంతకు లెవరు? అహల్య ఎందుకు పారిపోయింది? నేరస్థులను పట్టుకోవడంలో పోలీసులు ఎందుకు విఫలమయ్యారు?

ఆద్యంతం ఉత్కంఠతో చదివించే

'శ్రీధర్' రచన

ఆంధ్రప్రభ

సచిత్ర వారపత్రికలో

వచ్చే వారం

ప్రారంభం

## వీడని నీడలు


నుండి చూస్తుంటే మధు గది కన్పిస్తుంది. ఒక ఆలోచన మెరిసింది శేఖర్‌లో. మధు గదిలో పద్మ ఉండొచ్చు అనుకొని గదిలోకి తొంగి తొంగి చూశాడు.

అంతలో ఆ గదిలోంచి మధు వచ్చి తలుపేసుకున్నాడు.

శేఖర్ ముఖం నల్లగా మాడిపోయింది.

మరో అరగంటసేపు గడిచాక పద్మ వచ్చింది. వచ్చి ఇక్కడేం చేస్తున్నారు అని అడిగింది.

"నల్లని మబ్బుల మధ్య ఉన్న అర్ధచంద్రుణ్ణి చూస్తున్నాను. వర్షం పడే సూచనలు ఉన్నాయి పద."

• • • •

ఉదయం ఏడుగంటలయింది.

"నే వెళ్ళిపోతున్నాను. నువ్వొస్తావా? ఇంకా ఇక్కడే ఉంటావా?"

"అదేమిటండీ—ఇంత అర్జంటు? ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టారుకదా!"

"నాకు అర్జంటు పని ఉంది. వచ్చే ఉద్దేశం ఉంటే బయల్దేరు. ఎనిమిది గంటలకు ట్రైన్."

"వస్తానుండండి. అమ్మకి, నాన్నగారికి చెప్పి వస్తాను."

• • •

గదిలో ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తున్నాడు శేఖర్.

ఒక్కతే కూతురని గారాబం చేసి పూర్తి స్వేచ్ఛ నిచ్చారు పద్మకి తల్లిదండ్రులు... ఉన్న నాలుగు రోజులూ చూసిన సంఘటనల కర్థం ఏమిటి? తనున్నాడని భయం కూడా లేకుండా పద్మ ఎంతలా ప్రవర్తించింది! తలచుకొంటుంటే తలనెంటుకుంది కోపం... ఆడవాళ్ళు ఎంతకైనా తెగుదురు... అమాయకత్వంలో ఎంత నీచత్వం ఉంది?

"ఏమిటో! శ్రీవారు అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? కొత్త ప్లాటా?" వచ్చి కుర్చీలో కూర్చుంటూ అడిగింది పద్మ.

"అవును! కొత్త ప్లాట్... సరికొత్త వింత ప్లాట్...

"ఏమిటది?"

"చెప్పమంటావా? జాగ్రత్తగా విను—ఒక మంచి భర్తకు ఒక అమాయకమైన భార్య. ఆ అమాయకత్వం నిజం కాదు. నటన... వంచన..."

"అంటే?"

"ఆ అమాయకురాలికి పెళ్ళికి ముందే మరో మగాడితో అక్రమ సంబంధం!"

"అయితే...తరవాత...?"

"ఇంకా ఆలోచించలేదు... కాకపోతే ఈ పాత్రలు నేను సృష్టించినవి కాదు... దేవుడు సృష్టించినవి. నా కళ్ళ ముందే కదులుతున్నవి.. ఎవరో చెప్ప మంటావా?" వ్యంగ్యంగా చూస్తూ అడిగాడు.

"ఎవరు?" కుతూహలంగా అడిగింది పద్మ.

"వినాలనుందా? విని భరించ గలవా?"

"ఏమిటండీ మీా రంటున్నది? ఈరోజు ఇలా మాట్లాడుతున్నా రేమిటి?" ఆందోళనగా అడిగింది పద్మ.

"భరించగలనంటే చెప్తాను."

పద్మ శేఖర్ వైపు చూసింది అయోమయంగా.

"ఆ అమాయకురాలివి నువ్వే!"

పిడుగు పడ్డట్టయ్యింది పద్మకు.

"ఏమండీ!" గట్టిగా అరిచింది.

"ఆ రెండోవాడు ఎవరో చెప్పమంటావా? మధు! మా ఇంటి పక్కనే ఉన్న పి. జి. చిన్నప్పటి నుండి కలిసి మెలిసి తిరిగిన నీ అభిమానుడు, నీకు కోచింగ్ ఇచ్చి నిన్ను ఫస్టు క్లాసులో పాస్ చేయించిన నీ అలనాటి ప్రియుడు!"

"ఏమండీ! మీకు మతిపోయిందా?" గట్టిగా అరిచింది.

ఆమె పెదవులు వణుకుతున్నాయి. ముఖమంతా చెమటలు పట్టాయి.

"మతి పోలేదు. ఇప్పుడిప్పుడే మతి వస్తోంది."

"ఈ మాటలు ఏ ఆధారంతో మీరు అంటున్నారు?"

"ఇలాంటి వాటికి ఆధారం అక్కర్లేదు, పద్మా!"

"ఎవరు చెప్పిన మాయ మాటలు?"

"ఎవరో చెప్పిన మాటలు పట్టుకొని వూగిన వాడడు ఈ శేఖర్!"

"అలా అని మీరు అనుకుంటున్నారా?"

"అనుకోవడం ఏమిటి కనిపిస్తుంటేను?"

"అనుమానిస్తున్నారా?

"అనుమానం ఎందుకు? కంటి ఎదుట జరుగుతుంటేనూ?"

పద్మకు కోపం ఆగలేదు .. "ఏమిటండీ జరుగుతుందీ, మీరు చూసిందీమా?"

"నా నోటితో చెప్పించదలచుకున్నావా? మనుషుల మాటలు, చూపులు, నవ్వులు, ప్రవర్తనలు... వీటికి అర్థం తెలుసుకోలేని మూర్ఖుడిని కాను."


"మీరెందుకు తెలుసుకోలేరండీ? తెలుసుకోగలరు! కాదు. వూహించగలరు. ఏ విషయాన్నైనా ఇట్టే వూహించగలరు! రచయితలు గదా! ఎన్నయినా సృష్టించగలరు... ఒక స్త్రీ ఒక మగవాడితో మాట్లాడినంత మాత్రాన వాళ్ళ కిద్దరి మధ్యా ఏదో సంబంధం ఉందనే అర్థమా? పెళ్ళయిన తరవాత ప్రతి ఆడది మగవాడి సొంతమైపోతుంది. పెళ్ళి కాక ముందు ప్రతి ఒక్కరికీ కాలేజీల్లో, ఇంటి దగ్గర బంధువుల్లో ఏదోవిధంగా పరిచయాలూ, స్నేహాలూ ఉండవంటారా? అలా పిన్నంత మాత్రాన ఏదో సంబంధం ఉన్నదని అనుకోకూడదని వ్రాసిన మీరే ఇలా అంటున్నారా?

అంటే మీలో రచయిత వేరు, నగటు మనిషి వేరన్న మాట! మీలోని రచయితని కలం చేత పట్టినప్పుడే నిద్రలేపుతా రన్న మాట! కలం చేతిలో లేనప్పుడు మీలోని నగటు మనిషి సామాన్యంగానే ప్రవర్తిస్తా రన్నమాట. నా రచనతో ఒక్క మనిషైనా మారితేనాలు! అని మీ రెన్ని ఫొటో పరిచయాల్లో వ్రాయలేదు? సంఘంలోని నిజానిజాల్ని అద్దంపట్టి చూపే రచయితే ఆ నిజాన్ని కాదన్నప్పుడు ఉలుకుపోక చదివిన మనిషి ఎలా పాటించగలడండీ! మనిషిలోని రచయిత, ఆ మనిషి కలిసి కట్టుగా ఉన్నప్పుడే అతను అసలైన రచయిత అవుతాడు...

అభ్యుదయం, అభ్యుదయం అని మీ రెన్నిసార్లు వ్రాయలేదు. సమాజం ముందంజ వేయాలి. మానవ ప్రవృత్తి బాగా ఎదగాలి. అప్పుడే మన సమాజం అభ్యున్నతి చెందుతుంది అని మీ రెన్నిసార్లు చెప్పలేదు? అభ్యుదయం అన్నది మీ కలం ఇంకులో కాదండీ! మీ ఒంటి రక్తంలో ఉండాలి! అప్పుడే మీరు అభ్యుదయ రచయిత కాగలరు...

మన పెరగని మనుష్యుల మనసుల్ని పెంచేవి మీ రచనలని అనుకున్నాను. మీ మనసు ఇంకా ఎదగలేదని నా కిప్పుడే తెలిసింది.

ఒక కర్షకుడు పంట పండించి పదిమంది కడుపుల్నీ నింపాలంటే వాడి కడుపు కూడా నిండుగా ఉండాలి. ఒక సైనికుడు దేశాన్ని రక్షించి ప్రజలు హాయిగా ఉండేలా చూడాలంటే వాడు, వాడి కుటుంబం హాయిగా ఉండాలి. అలాగే, రచయిత ప్రజలకి మంచి, ప్రేమ, ఓర్పు, ఆలోచన, ఔదార్యం, అభ్యుదయం నేర్పాలంటే అవన్నీ ఆ రచయితకి ఉండాలి.




మీలోని రచయిత, నగటు మనిషి తూర్పు కొకరు పడమర కొకరు ప్రయాణిస్తున్నారు. ఇద్దరు కలసి ఒకే దిక్కువైపు ప్రయాణించినప్పుడే ఆ రచయిత నిజమైన రచయిత కాగలడు. మీ అభ్యుదయ వాదాలు గొంతులోంచి వచ్చినవే! అవి గొంతుదిగి గుండెలోంచి రావాలి. అప్పుడే మీకు, మీ రచనలకు అర్థం, పరమార్థం!

ఇవన్నీ మీ కంటే నేను బాగా వివరించలేను.

కానీ, నేను మీ దృష్టిలో అంత నీచంగా కన్పిస్తున్నానంటే మీలో అలాంటి భావాలున్నాయన్న మాట. ఇవన్నీ నేను చెప్తున్నది నన్ను నేను సమర్థించుకోడానికి కాదు. నేను ఎటువంటి తప్పు చేయలేదు అని మిమ్మల్ని ఒప్పించడానికీ కాదు. నాలో తప్పొప్పుల్ని నిరూపించుకొనే అవసరమూ నాకు లేదు. మీ మనసులో నన్నలా చిత్రించుకున్నారు కనుక మీలో ఆ అభిప్రాయం చెరిగిపోయే వరకు నేను మీ దగ్గరుండను. నిజం తెలుసుకుని రమ్మంటే నే వెప్పుడూ కాదనను. ఎన్నో సమస్యలను అతి చాకచక్యంతో చక్కగా పరిష్కరించే మీరు— మీ, నా జీవిత గమనాల్ని సరియైన దిక్కుకు మళ్ళిస్తారని ఆశిస్తున్నాను."

పద్మ ఆవేశంగా సూట్‌కేసు సర్దుకొని శేఖర్ దగ్గర కొచ్చింది.

"మీకు నేను చెప్పేంతటిదాన్ని కాను. అయినా చివరగా ఒక మాట... పెట్టుకున్న అద్దాల రంగు మీద— కన్పించే దృశ్యం రంగు ఆధారపడి ఉంటుంది. వస్తాను..." అని చెప్పి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న పద్మ వైపు అలా చూస్తూ ఉండిపోయాడు శేఖర్.

● ● ●

తొలికోడి కూసింది... శేఖర్ నిద్రపోలేదు... ఇంకా ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు...

అతనిలో బాధ, తన మీద తనకే అసహ్యం కలుగుతున్నాయి.

పద్మవంటి సంస్కారవంతురాల్ని తను వదులుకోలేడు. ఎంత చక్కగా నే నే స్థితిలో ఉన్నానో, ఎంతగా దిగజారిపోయానో చెప్పింది... పద్మలేని జీవితం తనకు ఎడారే! వెంటనే పద్మ దగ్గర కెళ్ళి తన తప్పును ఒప్పుకోవాలి. తనను మన్నించమని వేడుకోవాలి.

● ● ● ●

"పద్మ లేదు, బాబూ! నీ దగ్గరకనే బయల్దేరింది. రైల్వేస్టేషన్లో ఉండొచ్చు. పదు వెళ్దాం."

"ఫర్వాలేదండీ. నే వెళ్తాను."

ట్రైనింకా కదల్లేదు. టిక్కెట్ తీసుకుని ట్రైన్ దగ్గరి కెళ్ళాడు. అన్ని కంపార్ట్‌మెంట్లు వెతికాడు. ఫస్టుక్లాసు కంపార్టుమెంట్‌లో పద్మ ఒక్కతే కన్పించింది, కిటికీలోంచి బయటి చూస్తూ... "పద్మా!" అని పిలిచాడు.

ఏదో ఆలోచిస్తున్నట్లున్న పద్మ ఒక్కసారి ఇటువైపు చూసింది.

శేఖర్ దగ్గరగా వెళ్ళాడు... "పద్మా! నా దగ్గర కొస్తున్నావా? నన్ను క్షమించి వస్తున్నావా?"

"నేను మీ కోసం రావడం లేదు. ఏమిటిది? ప్రతి పుస్తకంలోను మీ సీరియల్స్ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగిపోయాయి అని ఉంది. ఎందుకు ఆగిపోయాయి. కేవలం ఒక్క కుటుంబ కలహం వల్ల సంఘాని కెంతో ఉపయోగపడే రచనలు వ్రాయడం మానేస్తారా? ఈ విషయం అడుగుదామనే వస్తున్నాను. మీరు వ్రాయండి. కేవలం ఒక చిన్న సమస్యకోసం సంఘ సమస్యల్నే చిక్కుముడులుగా ఉంచేస్తారా? భార్యగా నా మీద కాస్త ప్రేమ, గౌరవం ఉంచి మీ రచనల్ని కొనసాగించండి..."

"పద్మా! నన్నింకా చిత్రహింస చేయకు...రా! నాతో రా! నువ్వు లేందే నా కలం నడవదు. నేను మారిపోయాను. నన్ను, నాలో రచయితకు ఒక్కటిగా చేశావు. నువ్వు నాకు కనువిప్పు కలిగించావు. నన్ను క్షమించు, పద్మా! రా పద్మా!..."

పద్మకు సంతోషంతో గుండె నిండిపోయింది.

"ఛ! ఏమిటండీ ఆ మాటలు. నేను మీకు కనువిప్పు కలిగించడం, క్షమించడం ఏమిటి?" అని అనునయంగా శేఖర్ తల నిమిరింది.

రైలు కదిలింది. ★